క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కారంచేడు: శనివారం మండలంలోని కారంచేడు, స్వర్ణ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని పర్చూరు డీఈఈ ఆర్ రమేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు సబ్ స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ నిలిపి వేస్తామన్నారు. పైప్రాంతాల్లో విద్యుత్ సిబ్బంది మెయింటెనెన్స్ నిమిత్తం ఈ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన కోరారు.

యద్దనపూడి (పర్చూరు): మండలంలోని పర్చూరు, చెరుకూరు, అడుసుమల్లి విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద మరమ్మతుల నిమిత్తం శనివారం మండలంలో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు పర్చూరు ఏడీఈ రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

చీరాల టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు సీజనల్ వ్యాధులకు గురికాకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు శ్రీదేవి సూచించారు. శుక్రవారం మండలంలోని ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని 14 సబ్ సెంటర్లలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యాలకు గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నపిల్లలకు, గర్భిణులు అందించే వ్యాక్సిన్లను క్రమం తప్పకుండా వేయాలన్నారు. జ్వరం, జలుబు రాకుండా ప్రజలకు ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు


సుబ్బయ్య

వేటపాలెం: ప్రభుత్వం అనుమతి లేని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని ఎంఈవో సుబ్బయ్య శుక్రవారం తెలిపారు. గతంలో అనుమతి పొందిన ప్రైవేటు పాఠశాలలు వారి లైసెన్సులు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలలు విద్యాశాఖ నిబంధనల ప్రకారం విద్యార్థులు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రభుత్వం నుంచి పొందిన నిబంధనల మేరకు విద్యార్థులు పాఠశాలల్లో చేర్చుకోవాలని తెలిపారు. పరిమితికి మించి విద్యార్థుల ఉన్నా, అన్ని సౌకర్యాలు లేక పోయినా ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్హత ఉన్నా ఉపాధ్యాయుల చేతనే బోధన చేయించాలని తెలిపారు.

నైరుతి ఆగమనంతో వర్షాలు

● నేటి నుంచి మృగశిర కార్తె


అద్దంకి ప్రాంతంలో పడుతున్న వర్షం

అద్దంకి: నేటి నుంచే మృగశిర కార్తె ప్రవేశించనుంది. మృగశిర కార్తెలో ముసలెద్దు రంకె వేస్తుందనే సామెత ఉంది. అంటే ఆ కార్తెలు వర్షాలు సమృద్ధిగా పడి అప్పటిదాకా ఉన్న ఎండ తీవ్రత తగ్గుతుందనేది పెద్దల ఉద్దేశం అయి ఉండవచ్చు. మృగశిర కార్తెకు ఒక రోజు ముందే నైరుతి రుతుపవనాల ఆగమనంతో వర్షాలు పడుతున్నాయి. ఇక నుంచి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గనున్నాయి. ఎండ వేడిమి ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు ఉపశమనం లభించనుంది. ఇప్పటి వరకు పగటి కాలం ఎక్కువగా ఉండగా, ఇక నుంచి రోజు రోజుకు పగటి కాలం తగ్గి రాత్రి కాలం పెరగనుంది. నైరుతి రుతుపవనాల రాకతో రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు పడుతున్నాయి. దానిలో భాగంగా శుక్రవారం అద్దంకి మండలంలో ఒక మోస్తరు వర్షం పడింది.

షాక్ కొడుతున్న కూరగాయలు

● అమాంతం పెరిగిన ధరలు
● జిల్లాకు దిగుమతి చేసుకోవాల్సి రావడంతోనే అంటున్న వ్యాపారులు
● కోడి గుడ్ల ధరలకు రెక్కలు
● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



అద్దంకి/చీరాల రూరల్:

మార్కెట్‌లో కూరగాయల ధరలు షాక్ కొడుతున్నాయి. ధరలు చూస్తే ఏం కొనేటట్టు లేదు.. ఏమీ తినేటట్టు లేదు అన్న చందంగా మారింది పరిస్థితి. బాపట్ల జిల్లాలోని అద్దంకి, చీరాల, పర్చూరు, వేమూరు, రేపల్లె, బాపట్ల నియోజకవర్గాల్లోని గ్రామాల్లో వేసవిలో పెద్దగా రైతులు కూరగాలయ సాగు చేయక పోవడంతోనే కొరతతో ఈ పరిస్థితి ఏర్పడిందని, దూరం ప్రాంతాల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకోవాల్సి రావడంతోనే ఈ పరిస్థితి కలిగిందని వ్యాపారులు చెప్పుకొస్తున్నారు. ధరలను భరించలేక సామాన్యుడు ఇబ్బందులు పతున్నాడు. టమాట, పచ్చిమిరపకాయల దగ్గర నుంచి బీరకాయలు, బెండకాయలు, దోసకాయలు, వంకాయలు ఇలా ప్రతి కూరగాయ ధర ఆకాశాన్ని అంటింది. ఏది కొనాలన్నా రూ.50 నుంచి 80కి పై మాటే. రూ.100 తీసుకెళితే ఒక కేజీన్నర కూడా రాని పరిస్థితి. ఆకుకూరలు తిందామన్నా ఆవీ కట్ట రూ.20 నుంచి రూ.40 వరకు పలుకుతున్నాయని గృహిణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలా ఉంటే మాంసాహారుల్లో అధిక మంది కోడిగుడ్లు, చికెన్, మారసం ధరల రేట్లు పెరిగిపోయాయి. రూ.5కు విక్రయించిన గుడ్డు ప్రస్తుతం రూ.7 పలుకుతోంది. దాంతో ఏమి కొని తినాలో అర్థం కావడం లేదని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కూరగాయల సాగుకు కష్టంగానే ఉంది.

కూరగాయల ధరలు ఇలా..

కూరగాయల పేర్లు	ధర కిలోల్లో
టమోటా	50
బీరకాయ	80
పచ్చిమిరప	100
బెండకాయలు	60
బీట్‌రూట్	60
క్యారెట్	80
బంగాళా దుంపలు	40
చిక్కుడు కాయలు	120
దోసకాయలు	40
చికెన్	250
మటన్	900
కోడిగుడ్లు డజను	84

ఏదీ కొనలేకపోతున్నాం..

బజారల్లో ఏ కూరగాయ కొనాలన్నా భయంగా ఉంది. రూ.100 తీసుకుని వెళ్తే ఒక కిలో కూరగాయలు రావడమే గగనంగా మారింది. ఏ కూరగాయను కదిలించినా రూ.50 నుంచి రూ.80కి పైమాటే. ఎప్పుడూ లేని విధంగా ధరలు పెరిగిపోతున్నాయి. నాలుగైదు కిలోల కూరగాయలు కొనాలంటే రూ.500 కాగితం కావాల్సిందే.

– లక్ష్మి గృహిణి

ధరలు ఆకాశాన్నంటాయి..

మార్కెట్‌లో కూరగాయల ధరలు బాగా పెరిగిపోయాయి. ఏది కొనాలన్నా కిలో రూ.100 వరకు చెప్తున్నారు. రూ.50 నుంచి రూ.80 రూ.100 పలుకుతున్నాయి. కోడి గుడ్ల ధరలు పైకి ఎగబాకాయి. చికెన్, మటన్ ధరలు పెరిగిపోయాయి. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి కూరల ధరలు పెరిగి ఇంకేమిటి తినాలో తెలియడం లేదు.

– శ్రీదేవి గృహిణి

జగన్ మోహన్‌రెడ్డిని కలిసిన నాయకులు



చీరాల అర్బన్: కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పోటీచేసిన అభ్యర్థులు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిశారు. వారిలో చీరాల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్‌బాబు ఉన్నారు.

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పోలేరమ్మతల్లి

● ఈనెల 11న 55వ శిడిమహోత్సవం, తిరునాళ్లు


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న పోలేరమ్మ తల్లి

చీరాల టౌన్: కోరిన కోర్కెలు తీర్చి భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న తోటవారిపాలెం పోలేరమ్మ తల్లిశిడి మహోత్సవం మంగళవారం వైభవంగా జరగనుంది. బాపట్ల జిల్లాలో పెద్ద ఎత్తున జరిగే తోటవారిపాలెం పోలేరమ్మ తిరునాళ్లకు ఎంతో విశిష్టత ఉంది. గత 54 ఏళ్లుగా ప్రతి ఏడాది అమ్మవారి తిరునాళ్లను ఘనంగా నిర్వహిస్తారు. భక్తుల పాలిట కొంగు బంగారంగా ఉండే తోటవారిపాలెం పోలేరమ్మ అమ్మవారి గుడి అంటే మంచి ప్రసిద్ధి ఉంది. ప్రతి మంగళ, ఆదివారాల్లో భక్తులు విరివిరిగా వచ్చి విశేష పూజలను నిర్వహిస్తుంటారు. ఆపదలో ఉన్న భక్తుల కష్టాలు, కోర్కెలను తీర్చే తల్లిగా పోలేరమ్మ తల్లికి పేరుంది. అందుకే ప్రతి ఏడాది అమ్మవారి తిరునాళ్ల, శిడి మహోత్సవాన్ని ఘనంగా జరుపుతారు. తిరునాళ్ల ఈ ఏడాది వైభవంగా నిర్వహించేందుకు కమిటీ అన్నీ ఏర్పాట్లు సిద్ధం చేశారు. తిరునాళ్ల రోజు శిడి పెళ్లి కొడుకుతో ఊరేగింపుగా అమ్మవారి గుడికి వెళ్లి గుడి వద్ద ఉండే శిడిమానుకు ఒక పెట్టెలో మేకపోతును ఉంచి, గుడి చుట్టూ మూడు ప్రదక్షణలు చేస్తారు. ఈసమయంలో శిడిమాను పైభాగంలో చెక్కపెట్టెలో ఉంచిన మేకపోతును భక్తులు జీడికాయలతో కొడుతుంటారు. శిడి మాను లాగితే కష్టాలు తొలిగిపోతాయని భావించే భక్తులు శిడిమాను బండిని లాగేందుకు పోటీ పడతారు. అలానే తిరునాళ్ల సందర్భంగా ప్రత్యేకంగా విద్యుత్ ప్రభలు ఆకర్షణగా నిలుస్తాయి. ఈ ఏడాది ప్రభలతో పాటు మ్యూజికల్ నైట్, నాటికలు, కళాకారులతో ప్రదర్శనలు వేయనున్నారు. తిరునాళ్లను పురస్కరించుకొని పశుసంపదతో పాటు వాహనాలను గుడి చుట్టూ తిప్పి ప్రజలు తమ మొక్కులు తీర్చుకుంటారు. తిరునాళ్లను చూసేందుకు బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాల నుంచి ప్రజలు వేలాది సంఖ్యలో వస్తుంటారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పుస్తక పఠనంతో విద్యార్థులకు జ్ఞానం


గ్రంథాలయంలో విజేతలైన విద్యార్థులతో అతిథులు

కారంచేడు: గ్రంథాలయాల్లో విజ్ఞానాన్ని పెంపొందించే ప్రతి పుస్తకాన్ని చదువుతూ వాటితో వారికి అవసరమైన విజ్ఞానాన్ని సొంతం చేసుకోవాలని రిటైర్డ్ లెక్చరర్ కే బుచ్చయ్యచౌదరి అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు చెరువుకట్ట మీద ఉన్న ప్రభుత్వ గ్రంథాలయంలో మే 15వ తేదీ నుంచి నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలచిన విద్యార్థులకు ఆయన చేతులమీదుగా బహుమతలు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తక పఠనంను అలవర్చుకోవడం వలన వారు పెద్ద వారు అయిన తరువాత కూడా విజ్ఞానం కోసం చదువుకోవడం అలవాటవుతుందన్నారు. గ్రంథాలయంలో ఉండే న్యూస్ పేపర్లు చదవడం, విజ్ఞానాన్ని అందించే అనేక రకాల పుస్తకాలను కూడా ఉచితంగా చదువుకోవచ్చాన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్య వారిని ఉన్నత స్థితికి చేరుస్తుందన్నారు. గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకొని విద్యార్థులు వారికి అవసరమైన పుస్తకాలు ఇంటికి కూడా తీసుకెళ్లి చదువుకొని మళ్లీ అప్పగించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎం నాగయ్య, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

క్షేత్ర పరిశీలనతో విజ్ఞానం పెంపు


వేరుశనగ పంటలను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థులు

చీరాల టౌన్: వ్యవసాయ కోర్సులు చదివే విద్యార్థులకు క్షేత్రస్థాయి పరిశీలనలు, పర్యటనలు అనేక విషయాలతో విజ్ఞానం పెరుగుతుందని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కె.రమణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కావూరివారి పాలెం గ్రామంలోని ఇసుక నేలల్లో సాగు చేస్తున్న వేరుశనగ, ఇతర పంటలను కందుకూరు వ్యవసాయ కళాశాల విద్యార్థులు శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఉద్యాన పంటలను పరిశీలించారు. రైతులు పండిస్తున్న వేరుశనగ పంటల్లో సస్యరక్షణ చర్యలు గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఉద్యాన పంటల సాగులో తీసుకోవాల్సిన, రైతులు తీసుకుంటున్న వివిధ రకాల చర్యలను నిశితంగా నమోదు చేసుకున్నారు. ఉద్యాన కోర్సులు చదివే విద్యార్థులకు క్షేత్రస్థాయి పర్యటనలు ఉపయోగపడుతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కందుకూరు వ్యవసాయ కళాశాల విద్యార్థులతో పాటుగా గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

పట్టణంలో వీధుల పేర్లతో బోర్డుల ఏర్పాటు





పట్టణంలోని ప్రధాన రోడ్ల వద్ద ఏర్పాటు చేసిన బోర్డులు

చీరాల అర్బన్: పలానా రోడ్డుకు ఏలా వెళ్లాలని అడిగితే ఇలా వెళ్లాలని చెప్పేవాళ్లం. రోడ్డు పేరు గుర్తుంది కాని ఆ రోడ్డు ఎక్కడ ఉందో బయట ఊరి వారికి అంతుచిక్కదు. రోడ్డున వెళ్లే వారికి అడుగుతూ చివరకు గమ్యస్థానం చేరుకుంటాం. చీరాల మున్సిపాలిటీలోని పలు ప్రధాన రోడ్లకు ఇటీవల కొత్తగా నేమ్ బోర్డులు ఏర్పాటు చేశారు. చీరాల మున్సిపాలిటీలో మొత్తం 33 వార్డులు ఉన్నాయి. వార్డులలో కొన్ని ప్రధాన రోడ్లకు గతంలోనే పేర్లు పెట్టారు. గోడకు చిన్న సైజు బోర్డులను ఏర్పాటు చేశారు. కాలక్రమంలో అవి కనిపించడం లేదు. మున్సిపాలిటీలోని పలు ప్రధాన రోడ్లకు స్టీల్ బోర్డులు ఏర్పాటు చేశారు. మొత్తం 60 బోర్డులను మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.10 లక్షల వ్యయంతో వీటిని పట్టణంలోని ప్రధాన రోడ్ల కూడళ్లలో ఏర్పాటు చేశారు. బయట ఊరి నుంచి వచ్చిన వారికి సౌలభ్యంగా ఉండడంతో పాటు ప్రధాన రోడ్లకు కూడా కొత్తకళ సంతరించుకుంది.

ఈవోపీఆర్డీ సేవలు అభినందనీయం

నాగులుప్పలపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విస్తరణాధికారిగా సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన ఏవీవీ కుమారి సేవలు అభినందనీయమని మండల పరిషత్ అధ్యక్షురాలు నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అన్నారు. ఈవోపీఆర్డీగా సేవలందించి గత నెల 31వ తేదీ ఉద్యోగ విరమణ పొందిన వేణుకుమారి, తాతయ్య దంపతులను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దంపతులు అంజమ్మ కృష్ణారెడ్డి, ఎంపీడీవో మహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ మూర్తి, డిప్యూటీ తహసీల్దార్ జయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం కృషి


వల్లాపల్లిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న అధికారులు

మార్టూరు: వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పాసైన విద్యార్థినిలు అదే పాఠశాలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో చేరి మెరుగైన భవిష్యత్‌కు పునాదులు వేసుకొని కళాశాల అభివృద్ధికి తోడ్పాడాలని కళాశాల అధ్యాపక బృందం శుక్రవారం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఇటీవల పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినుల నివాసాలకు వెళ్లి మహిళా అక్షరాస్యత గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం కళాశాలలో అడ్మిషన్లు రాయించారు. అధ్యాపక బృందం సయ్యద్ ఇమామ్ సాహెబ్, జి. పోతురాజు, గోలి భాను ప్రకాష్, కే శ్రీనివాసరావు, కే శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

వల్లాపల్లిలో..

బల్లికురవ: తక్కువ ఫీజుతో అనుభవీయులైన అధ్యాపకుల పర్యవేక్షణలో ఒత్తిడిలేని విద్యను అందిస్తున్నట్లు బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం. అనిల్ కుమార్ తెలిపారు. శుక్రవారం వల్లాపల్లి గ్రామంలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పదోతరగతి పాసైన విద్యార్థులు, తల్లిదండ్రులను కలిసి అప్లికేషన్లు అందజేశారు. ఏప్రిల్ 19 నుంచి కళాశాల పరిధిలోని 10 గ్రామాల్లో మొదటి రౌండ్ ఇంటింటా క్యాంపెయిన్ పూర్తిచేశామని స్పెషల్ డ్రైవ్‌గా రెండో రౌండ్ క్యాంపింగ్ తిరుగుతున్నట్లు చెప్పారు. సీఈసీ బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో ఇప్పటికి అప్లికేషన్లు తీసుకుని 25 మంది జాయిన్ అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డిజిటల్ తరగతులు, ప్రయోగశాలలు ఆగస్టు నుంచి ఫిబ్రవరి వరకు స్టడీ అవర్లు, స్లిప్ టెస్టులతో గత విద్యా సంవత్సరంలో జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు విద్యార్థులు సాధించిన ఫలితాలను బ్రోచర్లు ద్వారా వివరించారు. అడ్మిషన్లు పెంచి కళాశాల బలోపేతానికి చేయూత నివ్వాలని ప్రిన్సిపాల్ అధ్యాపకులను కోరారు.


విద్యార్థినికి అడ్మిషన్ ఇస్తున్న కళాశాల అధ్యాపక బృందం

సోపిరాల పోలేరమ్మ తిరునాళ్లు రేపు

చినగంజాం: సోపిరాల గ్రామ దేవత పోలేరమ్మ తిరునాళ్లు రేపటి నుంచి జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 9న ఆదివారం సద్దులు, వడపప్పు పానకము ప్రసాద వినియోగం, సాయంత్రం పోలేరమ్మ అమ్మవారి గుడి వద్ద కీర్తిశేషులు డీవీ సుబ్బారావు మనుమడు ఆంధ్ర తాన్‌సేన్ బిరుదాంకితుడు డీవీ సుబ్బారావుచే సత్యహరిచంద్ర నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. 10న సోమవారం సద్దులు, వడపప్పు, పానకం, ప్రసాద వినియోగం, సాయంత్రం మండలస్థాయి పోలురాధ ఎడ్లబండ పోటీలు జరుగుతాయన్నారు. 11న మంగళవారం పసుపు కుంకుమలతో, నీళ్ల బిందెలతో, సోపిరాల గ్రామ ప్రజలతో ఊరేగింపుగా అమ్మవారి దేవస్థానానికి చేరుతారన్నారు. అనంతరం అన్నప్రసాద వినియోగం, మధ్యాహ్నం 3 గంటలకు మేళతాళాలతో ప్రభ ఊరేగింపు, సాయంత్రం పోలేరమ్మ అమ్మవారి గుడి వద్ద విద్యుత్‌ప్రభ, మాధవ ఈవెంట్స్ నెల్లూరు వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని వివరాలు ప్రకటించారు. గ్రామస్తులంతా తమ వంతు సహకారం అందించి పోలేరమ్మ తిరునాళ్ల విజయవంతం చేయాల్సిందిగా కోరుతున్నామని చెప్పారు.

9న వాకర్స్ అసోసియేషన్ సమావేశం

చీరాల రూరల్: వాకర్స్ ఇంటరేషనల్, ఎస్ఆర్అండ్‌పీఎం హైస్కూలు చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ముంతావారి సెంటర్లోని ఎస్‌వీఆర్అండ్ ఎస్‌జెఆర్ ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో వాకర్స్ అసోసియేషన్ జిల్లా రెండో కేబినెట్ సమావేశం నిర్వహించనున్నట్లు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పోలుదాసు రామకృష్ణ, చారుగుళ్ల గురుప్రసాద్‌లు శుక్రవారం తెలిపారు. సమావేశానికి బాపట్ల జిల్లాతో పాటు నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలకు చెందిన నాయకులు పాల్గొంటారని తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు వి. మురళి మోహనరావు, డిస్ట్రిక్టు 203 గవర్నర్ పి. శ్రీనివాసులు రెడ్డి, ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు చెలికాని సీతారామయ్య, నేతాజి సుబ్బారెడ్డి, ముఖ్య అతిథులుగా డాక్టర్ ఇస్తర్ల బాబురావు, విశిష్ట అతిథిగా డాక్టర్ గడ్డం పృథ్వీ పాల్గొని విలువైన సందేశాలు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో వాకర్స్ సభ్యులు, ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

ప్రత్యేక హోదా సాధనకు చంద్రబాబు కృషిచేయాలి

చీరాల: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించిన చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకురావడానికి ఇదే సరైన సమయమని, ఆ దిశగా ఆయన కృషి చేయాలని మాజీ ఎంపీ చిమటా సాంబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నరేంద్రమోదీని మూడోసారి ప్రధానిగా చేసే విషయంలో చంద్రబాబునాయుడు కీలక పాత్ర పోషించారన్నారు. రాష్ట్రంలో అధికంగా ఎంపీ సీట్లను సాధించిన టీడీపీ కేంద్ర మంత్రి పదవులు సాధించడంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్న ప్రత్యేక హోదా కోసం బలంగా డిమాండ్ చేయాలన్నారు. గత విషయాలను పక్కన పెట్టి రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు రైల్వే జోన్ కోసం కృషి చేసి ప్రజలు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలనే ప్రజల ఆకాంక్షను కేంద్ర ప్రభుత్వం వద్ద ఉంచి ఆ దిశగా కృషి చేయాలని కోరారు.

రిజిస్ట్రేషన్లు నూరుశాతం పూర్తిచేయాలి


వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న వైద్యాధికారి

బల్లికురవ: గర్భిణులు, చిన్నారుల రిజిస్ట్రేషన్లు గ్రామ సచివాలయాల వారీగా నూరుశాతం పూర్తిచేయాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్ కోరారు. శుక్రవారం ఉప్పుమాగులూరు–2 సచివాలయంలో 104 శిబిరంలో భాగంగా షుగరు, బీపీ, హిమోగ్లోబిన్ పరీక్షలతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశావర్కర్లతో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ నుంచి గర్భిణులు చిన్నారుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఇంటింటా సర్వే చేస్తున్నారని గర్భిణులు 90 శాతం, చిన్నారులు 80 శాతం రిజిస్ట్రేషన్ జరిగిందని పర్సంటేజీ లక్ష్యాలు పూర్తిచేయాలన్నారు. రిజిస్ట్రేషన్లతో వ్యాక్సిన్‌లు, చెకప్‌లు సులభంగా పూర్తిచేయవచ్చని చెప్పారు. వర్షాల సీజన్ ఆరంభమైనందున సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి కోరారు.

సర్పంచ్ భర్తపై టీడీపీ నాయకుల దాడి

ఇంకొల్లు (చినగంజాం): సర్పంచ్ భర్తపై టీడీపీ నాయకుల దాడి చేసిన ఘటన ఇంకొల్లు మండల పరిధిలో శుక్రవారం జరిగింది. బాధితుడి వివరాల మేరకు.. కారంచేడు మండలం జరుబులవారిపాలెం సర్పంచ్ కుమారి భర్త మాదాసు సుబ్బారావు తెలంగాణలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల తన స్వగ్రామానికి వచ్చాడు. శుక్రవారం తన పనిమీద బైక్‌పై ఇంకొల్లుకు బయలుదేరాడు. ఈక్రమంలో ఇంకొల్లు మాదిగపల్లె వద్ద టీడీపీకి చెందిన నాగరాజు, శేఖర్‌తో పాటు మరో ఐదుగురు అతనిపై కర్రలతో మూకుమ్మడిగా దాడిచేసి ఇష్టమొచ్చిన రీతిలో తీవ్రంగా గాయపరిచారు. అనంతరం సుబ్బారావును ఇసుకదరిశి గ్రామ సమీపానికి తీసుకువెళ్లి అక్కడి నుంచి వేరే వ్యక్తి బైక్‌పై తిరిగి పంపించారు. సుబ్బారావు చీరాల ఏరియా వైద్యశాలలో చేరి చికిత్స పొందాడు. అనంతరం ఏరియా ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నాణ్యమైన పొగాకు బేళ్లు తీసుకురావాలి

టంగుటూరు: రైతులు నాణ్యమైన పొగాకు బేళ్లను తీసుకుని వస్తే అత్యధిక ధరలు పొందవచ్చని పొగాకు బోర్డు ప్రాంతీయ అధికారి లక్ష్మణరావు సూచించారు. అలాగే అన్యపదార్థాలు, గేడు మిక్స్ లేకుండా తీసుకురావాలని రైతులను కోరారు. స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని పొగాకు బోర్డు ప్రాంతీయ అధికారి లక్ష్మణరావు శుక్రవారం వేలం పక్రియని పరిశీలించారు.

